# మరుపుల మడతలనుండి...

ఒక్కసారి గట్టిగా కళ్ళు నులుముకొని, ఎదురుగా వున్న బల్ల మీదికి కాళ్లు బారజాపుకొని, జారగిల పడుకొన్నాడు శివరామయ్య. పక్క కుదరక అటూ ఇటూ మసిలాడు. మసిలినప్పుడల్లా శరీరం, ఇరుకులో చిక్కుకొని గిజగిజలాడిపోతున్నది.

పక్కనే పడిఉన్న ఉత్తరాన్ని పదకొండోసారి చదువుకొన్నాడు. అవే అక్షరాలు, అవే పంక్తులు, అవే విషయాలు! అవతలవారికి అన్నీ నచ్చాయిట. సొమ్ము దగ్గరే పేచీ పడుతున్నదిట. అదేదో తేల్చుకుంటే, లగ్నాలు పెట్టుకొనడానికి అభ్యంతరం ఉండదుట! మరో మాటల్లో చెప్పాలంటే, శారద నెత్తిమీద వేలకు వేలు, ఉంచితే తప్ప,

దాని కా మూడుముళ్ళూ పడవన్నమాట ! తనదగ్గర ఆపాటి డబ్బుండాలేగానీ, శారదమీద ఖర్చుచేయడానికి తన కేమీ అభ్యంతరం లేదు...

శారదకిప్పుడు పదహారు వెళ్ళి పదిహేడో ఏడు నడుస్తున్నది. రెండు మూడేళ్లు ఆగినా ఫర్వాలేదు. కానీ ఆవిడ తనను ఊపిరి తీసుకోనివ్వడంలేదు.

శారద కిప్పుడు పదిహేడేళ్ళంటే ఆ సంఘటన జరిగి 18 సంవత్సరాలన్నమాట ! ఎన్నేళ్ళయితేనేంగానీ, అప్పటి నుండీ రాచపుండులాగా అది సలుపుతూనే ఉంది!

అప్పుడు తను గుంటూరులో ఉంటున్నాడు. కన్నవారి తోటలో మకాం. ఒక్క అరమైలు పైకిపోతే, జూట్ మిల్లు ఉంది. ఆచుట్టుపక్కలంతా కూలీనాలీ జనం పాకలు వేసుకొని, రేకులడ్డం పెట్టుకొని రోజులు వెళ్ళదీస్తున్నారు. ఇప్పుడంటే, అదంతా ఇళ్ళమయమయిందిగానీ — ఆ రోజుల్లో తిప్పి తిప్పి లెక్కించినా పాతిక ముప్ఫయ్ ఇళ్ళకన్న మించి లేవు.

అప్పుడు తనింకా కానిస్టేబుల్‌గానే ఉన్నాడు. స్టేషనుకు దగ్గరగా ఉంటుందని, ఓ ప్రైవేటు ఇంట్లో అద్దెకు కుదిరాడు. అద్దెన్నమాటేగానీ, నెలకు మూడో, మూడుంబావలావో ఇచ్చేవాడు. సంసారం కూడా ముచ్చటగా ముగ్గురులో ఉండేది. వచ్చే జీతం, దేనికీ కొరతలేకుండా సరిపోయేది.

ఉద్యోగ నిర్వహణలో తనెప్పుడూ పాలుమాలింది లేదు. ఏ ప్రలోభానికీ తను లొంగనూ లేదు. చట్టాన్ని చాలా ఖచ్చితంగా అమలు జరిపేవాడు. తను న్యాయమనుకొన్న దానికి భిన్నంగా వ్యవహరించలేదు. తను అధర్మమనుకొన్న దాన్ని పై అధికారుల దృష్టికి తీసుకురాకుండా మాననూ లేదు. ఇంకెవరో ఏదో అంటారని, తను మసిపూసి మారేడు కాయ చేయలేదు. ఈ క్షణాన తను కన్ను మూయవలసి వస్తే, గత జీవితాన్ని తలుచుకొని, పశ్చాత్తాప పడవలసిన అగత్యం లేనేలేదు — ఆ వొక్క సంఘటననూ తప్పిస్తే!

అదయినా తను కావాలని చేసిందికాదు. చట్ట ప్రకారం చూస్తే తను చేసింది న్యాయమే! కానీ, అందువల్ల జరగకూడని ఘోరం జరిగిపోయింది. అందుకే విచారించడం! ఆ రోజు - ఆ రోజు, తనకింకా బాగా జ్ఞాపకం ఉన్నది. ఇల్లాగే, సన్నగా, పుల్ల చినుకులు పడుతున్నాయి. ఈదురు గాలి, చర్మాన్ని వొణికించి పారేస్తున్నది. బురదనీటితో రోడ్డంతా రెపరెపలాడిపోతున్నది.

అసలే ఇక్కడ ఇరుకు, పైగా సినిమాహాలు, ఆ రోడ్డు మూలనే ఉన్నది. కొత్త సినిమా విడుదలయినరోజున, ఇక చెప్పనే అక్కర్లేదు. రోడ్డంతా మనుషులతో నిండిపోయి, అటు నుండి ఇటు దాటడమే బ్రహ్మప్రళయ మవుతున్నది !

జట్కాలు, రిక్షాలు వాంఎద్దుబళ్ళు, చిత్రవత్తుగా కదులుతున్నాయి. ఎక్కడ ఏ కాస్త పొరపాటు జరిగినా, ప్రమాదం తప్పదు. తను కళ్ళల్లో వత్తి వేసుకొని చూస్తు న్నాడు. దూరంనుండి, ఓ కారు రయ్‌మని దూసుకొస్తు న్నది. తను విజిల్ వేశాడు; వేస్తున్నాడు. అయినా కారు ఆగకుండా ముందుకు వస్తూనే వుంది! తను రోడ్డుకు అడ్డంగా నిలబడి, రెండు చేతులూ బార్లా జాపాడు. కారు నిలబడి పోయింది. తను అర్జెంటు పనిమీద పోతున్నాననీ, తనను ఆపవద్దనీ అన్నా డతను. మెడలోని స్టెతస్కోపును తీసి పక్కనే పెట్టాడు. చూపుడు వేలితో నుదురుమీద చెమటను తుడుచుకొన్నాడు.

అతనితో మాట్లాడే వ్యవధి లేదు తనకు. కారును రోడ్డు ప్రక్కనే ఆపుచేయించాడు. మిగిలిన బళ్ళను, జనాన్ని పంపించేశాడు. ఈ పావుగంటసేపు అతనేదో వణుక్కుంటూనే ఉన్నాడు - చిరాకు పడుతూనే ఉన్నాడు.

డాక్టరు పేరు, కారు నెంబరు, ఫోన్ నెంబరు నోట్ చేసుకొన్నాడు. ఓసారి 'సి బుక్'ను చెక్ చేశాడు; కారును విడిచిపెట్టాడు.

రెండో ఆట సగబడ అయిందాకా తను

డ్యూటీలోనే ఉన్నాడు. అప్పటికి తుప్పరకూడా ఆగి పోయింది. కానీ ఈదురుగాలి మాత్రం తెరలు తెరలుగా వీస్తూనే వుంది. టోపీని ముఖంమీదికి లాక్కుని మైదానానికి అడ్డంపడి తను ఇంటికొచ్చాడు. ఇల్లు తాళం వేసి ఉంది. తాళంచెవి పక్కింట్లో ఇచ్చి వెళ్ళిందావిడ; తను డ్రెస్ విప్పి, తుండుతో తల తుడుచుకొంటూ వరండాలో కూచున్నాడు. పది నిమిషాలకల్లా ఆవిడొచ్చింది. ముఖమంతా ముడుచుకు పోయివుంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. పెదవులు సన్నగా వణుకుతున్నాయి. పమిటతో కళ్ళూ, ముక్కూ తుడుచుకొన్న దావిడ.

"ఏమిటే?" అన్నాడతను.

"కనకమ్మగారమ్మాయి లేదూ శారద—పాపం—పోయిందండీ" అన్నదావిడ.

శారద తనకూ తెలుసు. అప్పుడప్పుడు తనే సైకిలు మీద కూర్చోబెట్టుకొని స్కూలు దగ్గర దించి, డ్యూటీకి పోతూ ఉండేవాడు. 'మావా మావా' అంటూ వెంట పడుతుండేది. బంతిపువ్వులాంటి శారద పోవడమంటే నమ్మ బుద్ధి కావడంలేదు.

"ఆ వొచ్చే డాక్టరు, ఓ అరగంట ముందొచ్చినట్టు

యితే, ఆ పిల్ల బ్రతికేదేనండీ?" అంటున్న దావిడ వంటింట్లో నించి.

తనేమీ మాట్లాడలేదు. అయినా ఏ మొఖం పెట్టుకొని మాట్లాడుతాడు గనక!